@netifocusnews @focustv
https://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625
FOCUS TELUGU TV అనునిత్యం - ప్రజాపక్షం
# నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
COMPLIMENTARY COPY
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: ఎం. తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | ఆదివారం, 28 జనవరి 2024 | పేజీలు - 4

# తెలంగాణలో.. కులగణన




## సీఎం రేవంత్ సంచలన నిర్ణయం..!

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి27:** త్వరలోనే రాష్ట్రంలో కుల గణన చేపట్టనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఈ నిర్ణయానికి కట్టుబడి ఉందన్నారు. కుల గణనకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ విభాగాలపై శనివారం రేవంత్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో అద్దె భవనాల్లో ఉన్న సంక్షేమ గురుకుల పాఠశాలలకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని సూచించారు. వీటికి సొంత భవనాలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన భవనాల నిర్మాణానికి సరిపడే స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలని అధికారులను ఆదేశించారు.

వివరాలు 2లో

కొత్త రేషన్ కార్డుల జారీకి
## కసరత్తు
బోగస్ రేషన్ కార్డుల తొలగింపునకు ఈకెవైసీ అమలు



2

ఫిబ్రవరి ఒకటిన ఎమ్మెల్యేగా
## కేసీఆర్ ప్రమాణ స్వీకారం



2

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి27:** ఫిబ్రవరి ఒకటో తేదీన గజ్వేల్ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ సమక్షంలో ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణం చేయనున్నారు.

# బిజెపిని ఓడించే సత్తా.. బీఆర్ఎస్‌కు మాత్రమే ఉంది

అసెంబ్లీలో ముగ్గురు ఎంపిలు, ఇద్దరు ఎమ్మెల్యేలను ఓడించాం

కాంగ్రెస్ జోడో..అంటూ..నేతలు ఛోడో అంటున్నారు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి27:** బిజెపిని ఓడించే సత్తా కేవలం బిఆర్ఎస్‌కు మాత్రమే ఉందని పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటి రామారావు అన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ముగ్గురు ఎంపిలను, ఇద్దరు ఎమ్మెల్యేలను బిఆర్ఎస్ అభ్యర్థులు మాత్రమే ఓడించారని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలంటే బిఆర్ఎస్‌కు మాత్రమే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి బిజెపిని ఓడించే సత్తా లేదన్నారు. జీహెచ్ఎంసీ ప్రజలంతా

మిగతా2లో

# త్వరలో కేబినేట్ విస్తరణ




కసరత్తు చేస్తున్న

సీఎం రేవంత్

మంత్రివర్గంలోకి

కోదండరామ్ చేరిక ఖాయం

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి27:** నాలుగు ఎమ్మెల్సీల ఎన్ఇనక ముగియడంతో ఇప్పుడు కేబినేట్ విస్తరణపై సర్వత్రా చర్చ మొదలయ్యింది. గవర్నర్ కోటాలో ఇద్దరు ఎంపికయ్యారు. ఎమ్మెల్యే కోటాలో ఇద్దరు ఎన్నికలయ్యారు. దీనికితోడు కొన్ని మంత్రి పదవులు కూడా ఖాళీగా ఉన్నాయి. దీంతో ఈ నలుగురిలో ఇద్దరు మంత్రి పదవులకు అర్హులన్న విషయం చర్చ సాగుతోంది. ప్రధానంగా తెలంగాణ ఉద్యమకారుడు కోదండరామ్ ను తోణం కేబినేట్‌లోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ఖాళీగా ఉన్న విద్యాశాఖను ఆయనకు అప్పగించే అవకాశం ఉంది. ఈ క్రమంలో తెలంగాణ నూతన విద్యా శాఖ మంత్రిగా ప్రొఫెసర్ కోదండరాం నియమితులయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మలి దశ తెలంగాణ ఉద్యమ సమయంలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఆయనకు రేవంత్ సర్కార్ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. ఈ క్రమంలో త్వరలోనే ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం ఈ పదవి అప్పగించే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. దీనిపై కొద్ది రోజుల్లోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ పార్లమెంట్ ఎన్నికల కంటే ముందే చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధిష్టానానికి విన్నవించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎవరెవరికి మంత్రి పదవులు కేటాయించాలనే దానిపైనా సీఎం సూచనల మేరకు కాంగ్రెస్ పెద్దలు దృష్టి సారించినట్లు సమాచారం. ప్రభుత్వ

మిగతా2లో

# తెలంగాణ మహిళలకు గుడ్ న్యూస్..
## ఆ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి27:** మేడారం జాతర సందర్భంగా ప్రత్యేక బస్సుల్లో మహిళల నుంచి కూడా ఛార్జీలు వసూలు చేయాలన్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రతిపాదనను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తిరస్కరించారు. రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధించి భట్టి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఉన్నతాధికారులు ఇటీవల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. వచ్చే మేడారం జాతర సందర్భంగా తిరిగే ప్రత్యేక బస్సుల్లో మహిళల నుంచి టిక్కెట్లు తీసుకుంటే సంస్థ ఆదాయం పెరుగుతుందని ప్రతిపాదించారు. దీనిపై భట్టి స్పందిస్తూ.. ఇది సరికాదని,



మిగతా2లో

## తెలంగాణలో కుల గణన..

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి27:** త్వరలోనే రాష్ట్రంలో కుల గణన చేపట్టనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఈ నిర్ణయానికి కట్టుబడి ఉందన్నారు. కుల గణనకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ విభాగాలపై శనివారం రేవంత్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో అద్దె భవనాల్లో ఉన్న సంక్షేమ గురుకుల పాఠశాలలకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని సూచించారు. వీటికి సొంత భవనాలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన భవనాల నిర్మాణానికి సరిపడే స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో స్కూల్ నిర్మాణానికి ఎంత ఖర్చవుతుందో అంచనా వేసి బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అన్నారు. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఇచ్చే డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు, వంట బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు చేయాలని అన్నారు. మహాత్మా జ్యోతిభాపూలే ఓవర్ సీస్ స్కాలర్ షిప్ స్కీమ్‌ను మరింత సమర్థం అమలు చేయాలని సీఎం ఆదేశించారు.

ఇప్పుడున్న దానికంటే ఎక్కువ మంది అర్హులైన విద్యార్థులకు మేలు జరిగేలా చూడాలని అన్నారు. విదేశాల్లో ఉన్న యూనివర్సిటీల ర్యాంకింగ్‌ల ఆధారంగా టాప్ యూనివర్సిటీలను గుర్తించి ఫ్రేమ్ వర్క్ తయారు చేయాలని చెప్పారు. వాటిలో చదివేందుకు వెళ్లే విద్యార్థులకు ఈ స్కీమ్‌లో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థలన్నీ వేర్వేరు చోట్ల విడివిడిగా కాకుండా ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని సూచించారు. నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ హబ్ నిర్మించే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, దీంతో స్కూళ్ల నిర్వహణ, పర్యవేక్షణ, అజమాయిషీ కూడా మరింత మెరుగ్గా చేసే వీలుంటుందని చెప్పారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఎడ్యుకేషన్ హబ్‌ల నిర్మాణానికి సరిపడే స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రంలో వీలు కాకుంటే ప్రత్యామ్నాయంగా అదే సెగ్మెంట్‌లో మరో పట్టణం, లేదంటే మండల కేంద్రాలను ఎంచుకోవాలని సూచించారు. ఇప్పటికే 20 ఎకరాలకుపైగా విస్తీర్ణం ఉన్న స్కూల్ ప్రాంగణాల్లో మిగతా భవనాలు నిర్మించి హబ్‌గా తీర్చిదిద్దే అవకాశాలుంటే పరిశీలించాలన్నారు. ఎడ్యుకేషన్ హబ్‌ల నిర్మాణానికి కార్పొరేట్ సంస్థల, కంపెనీల సహకారం తీసుకోవాలని చెప్పారు. సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ) ఫండ్స్‌ని సమీకరించాలని, ముందుకు వచ్చే దాతల నుంచి విరాళాలు స్వీకరించి ఈ భవన నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

కల్యాణమస్తు, షాదీ ముబారక్ లబ్ధిదారులకు నగదుతో పాటు తులం బంగారం అందించేందుకు అంచనా బడ్జెట్‌ను రూపొందించాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పుడున్న బీసీ స్టడీ సర్కిల్స్‌ను ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం యూనిట్‌గా ఏర్పాటు చేసే అంశంపై అధ్యయనం చేయాలని అన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ పొన్నం ప్రభాకర్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రదాన కార్యదర్శి శాంతికుమారి, సంబంధిత శాఖల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

## కొత్త రేషన్ కార్డుల జారీకి కసరత్తు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి27:** తెలగాణలో అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు, అనర్హుల రేషన్ కార్డులను కూడా తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇటీవల వచ్చిన అభ్యర్థనల ఆధారంగా కొత్త రేషన్ కార్డుల మంజూరుకు ప్రభుత్వం కసతరత్తు చేస్తోంది. రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నవారికి తెలంగాణ ప్రభుత్వం ఇలా శు భవార్త చెప్పబోతోంది. చెప్పింది. ఇటీవలే 5 గ్యారంటీల అమలు కోసం ప్రజాపాలన దరఖాస్తులు తీసుకున్న సర్కార్.. తాజాగా రేషన్ కార్డులకోసం మరోచోట దరఖాస్తులు స్వీకరిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మీ సేవ కేంద్రాల్లో ఫిబ్రవరి చివరి వారంలోపు వీటిని సమర్పించవచ్చు. బోగస్ రేషన్ కార్డుల నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం ఈకేవైసీ చేపట్టింది. ఇది పూర్తి చేయడానికి జనవరి 31 వరకు గడువు పొడగిస్తూ పౌర సరఫరాల కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు కొనసాగిన ప్రజాపాలనలో కూడా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించారు. సబ్సిడీ సిలిండర్ల కోసం మొత్తం 91.49 లక్షల మంది మహిళలు దరఖాస్తు చేసుకోగా, 92.23 లక్షల మంది మహిళలు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు.

## ఫిబ్రవరి ఒకటిన ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి27:** ఫిబ్రవరి ఒకటో తేదీన గజ్వేల్ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ సమక్షంలో ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణం చేయనున్నారు. నవంబర్‌లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. డిసెంబర్ 3న ఫలితాలు వెల్లడయ్యాయి. అదే నెల 9న కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులతో ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ ప్రమాణస్వీకారం చేయించారు. అంతకు ముందురోజు అర్ధరాత్రి కేసీఆర్ ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కాలుజారి పడిపోగా తుంటికి గాయమైంది. ఆ తర్వాత యశోద ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకున్నారు. ఇటీవల ఆయన కోలుకున్నారు. ప్రస్తుతం ఊతకర్ర సహాయంతో నడుస్తున్నారు. ఇదిలా ఉండగా.. గజ్వేల్‌లో కేసీఆర్ వరుసగా మూడోసారి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేశారు. ఎన్నికల్లో ఆయనకు 1,11,684 ఓట్లు పోలయ్యాయి. 45వేలకుపైగా మెజారిటీ బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్‌పై విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం నుంచి గజ్వేల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తూ వస్తున్నారు.

## త్వరలోనే కేబినేట్ విస్తరణ

(మొదటిపేజీ తరువాయి..)

సిఫార్సుల మేరకు ఇటీవల గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం , అమరుల్లా ఖాన్ ల నియామకానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోద ముద్ర వేశారు. ఈ ఎమ్మెల్సీల కోసం అంతకు ముందు పలువురి పేర్లు పరిశీలనకు వచ్చాయి. షబ్బీర్ అలీ, అలీ మస్కతి, జాఫర్ జావీద్, పేర్లు కూడా పరిశీలనకు వచ్చాయి. షబ్బీర్ అలీకి ప్రభుత్వ సలహాదారు పదవిని కట్టబెట్టారు. దీంతో ఆయన ఎమ్మెల్సీ రేసు నుంచి వైదొలిగారు. త్వరలోనే 54 కార్పొరేషన్లకు ఛైర్మన్లు నియమించనుంది తెలంగాణ ప్రభుత్వం. పార్లమెంట్ ఎన్నికల నాటికి నామినేటేడ్ పదవుల భర్తీతో పాటు ఎన్నికల హామీలను అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో అనేక వర్గాలను, సంఘాలను ఏకతాటిపైకి తీసుకురావడంలో ప్రొఫెసర్ కోదండరాం ప్రధాన పాత్ర పోషించారు. తెలంగాణ వచ్చాక తెలంగాణ జన సమితిని స్థాపించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చారు. దీంతో కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. టీఎస్పీఎస్సీ ఛైర్మన్ గా నియమిస్తారని వార్తలు వచ్చినప్పటికీ...మాజీ డీజీపీ మహేందర్ రెడ్డిని ఛైర్మన్ గా ఎంపిక చేసింది. కోదండరాంను మంత్రిని చేసి విద్యాశాఖను అప్పగిస్తే ప్రొఫెసర్ గా ఆయన అనుభవం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. మొత్తంగా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కోదండరామ్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

## తెలంగాణ మహిళలకు గుడ్ న్యూస్..

(మొదటిపేజీ తరువాయి..)

మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కొనసాగించాలని స్పష్టం చేశారు. మేడారం మాత్రమే కాకుండా ఏ జాతర సమయంలోనూ మహిళల నుంచి ఛార్జీలు తీసుకోవద్దని ఆదేశించారు. ఫిబ్రవరి 18 నుంచి 25 వరకు జరిగే మేడారం జాతరకు ప్రత్యేకంగా 6000 బస్సులను నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఒక్క హైదరాబాద్ నుంచే 2 వేల బస్సులు నడుపుతున్నారు.

**జాతరకు భారీగా ఏర్పాట్లు..**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరకు కౌంట్‌డౌన్ షురూ అయింది. కోట్లాదిమంది భక్తుల నమ్మకానికి ప్రతిరూపం.. మేడారం సమ్మక్క సారక్క జాతర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టింది కొత్త ప్రభుత్వం. స్థానిక ఆదివాసీ బిడ్డ సీతక్క మంత్రి కావడం, అదే జిల్లాకు చెందిన కొండా సురేఖ దేవాదాయ మంత్రిగా చార్జ్ తీసుకోవడం..ఈ రెండు స్పెషాలిటీల ప్రభావం ఈసారి మహా జాతరపై స్పష్టంగా కనిపించబోతోంది. వందకోట్లకు పైగా ఖర్చయ్యే జాతర కోసం ప్రభుత్వం ఇప్పటికే 70 కోట్లు మంజూరు చేసింది. ఈసారి జాతరకు ఐదు రాష్ట్రాల నుంచి కోటీ 50 లక్షల మంది భక్తులు వస్తారన్నది అంచనా. వీఐపీలు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండాలంటే జాతర నిర్వహణలో పోలీసులదే కీలక పాత్ర. పైగా.. .మావోయిస్టు యాక్షన్ టీమ్‌తో ముప్పు ఉన్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం అయ్యాయి. మేడారం జాతరకు వెళ్తే భక్తులకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు శుభవార్త చెప్పింది తెలంగాణ ఆర్టీసీ.

# బిజెపిని ఓడించే సత్తా బీఆర్ఎస్‌కు మాత్రమే ఉంది

(మొదటిపేజీ తరువాయి..)



కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుందని.. కానీ హైదరాబాద్ బయట స్వల్ప ఓట్ల తేడాతో సీట్లు తగ్గాయని.. 14 సీట్లలో స్వల్ప తేడాతో కోల్పోయామని కేటీఆర్ అన్నారు. శనివారం యూసుఫ్‌గూడాలో నిర్వహించిన బీఆర్ఎస్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేర్చలేక బీఆర్ఎస్‌ను బద్నామ్ చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ గొంతు పిసుకుతా అని రేవంత్ మాట్లాడారని.. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసినందుకు కేసీఆర్ గొంతు పిసుకుతారా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ భారత్ జోడో అంటుంటే ఆయన పార్టనర్స్ అంతా రాహుల్ చోడో అంటున్నారని ఎద్దేవా చేశారు. మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, నితీష్ కుమార్ అందరూ కాంగ్రెస్‌ను వదిలేస్తున్నారన్నారు. బీజేపీని ఎదుర్కనే సత్తా కాంగ్రెస్‌కు లేదన్నారు. బీజేపీని ఎదుర్కనే సత్తా కేసీఆర్, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ లాంటి నాయకులకే ఉందన్నారు. మహాలక్ష్మి పథకం పెట్టి మహిళల మధ్య గొడవలు పెట్టారన్నారు. ఫ్రీ బస్సు మంచిదే కానీ బస్సుల సంఖ్య పెంచాలని హితవుపలికారు. ఆటో డ్రైవర్ల పొట్ట కూడా కొట్టారన్నారు. ఒక పథకం పెట్టినపుడు సరైన ప్రణాళిక ఉండాలని సూచించారు. రాష్టంలో కోటి 57 లక్షల మంది మహిళలకు రూ.2500 ప్రతినెలా ఎప్పుడు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తేనే కాంగ్రెస్ భయంలో ఉంటదన్నారు. కిషన్‌రెడ్డి అంబర్ పేటలో ఎమ్మెల్యేగా ఓడిపోయి సానుభూతితో ఎంపీగా గెలిచారన్నారు. ఎంపీగా గెలిచిన కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి అయ్యాక ఒక్క బస్తీకైనా ఏమన్నా మంచి పని చేశారా అని నిలదీశారు. దేవుని పేరు చెప్పి రాజకీయాలు చేయడం తప్ప కిషన్ రెడ్డి చేసింది ఏముందని ప్రశ్నించారు. మోదీ ప్రియాయమైన ప్రధాని కాదని.. పిరమైన ప్రధాని అని జనాలు అంటున్నారన్నారు. భారత్ మొత్తంలో అట్టర్ ఎ÷-లాఫ్ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అంటూ విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీవి ఫెవికాల్ బంధమని కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఇంటింటి సమగ్ర సర్వే చేశామని.. తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డుపైకి తీసుకువచ్చిందని రామారావు విమర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం తెలంగాణ భవన్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిచామన్నారు. చాలా నియోజకవర్గాల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయామన్నారు. మోసం చేయడం కాంగ్రెస్ నైజమన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు బంగారు పళ్లెంలో తెలంగాణను పెట్టి ఇచ్చామన్నారు. ఇండియా కూటమి నుంచి ఒక్కో పార్టీకి బయటకు వెళ్లిపోతుందన్నారు. బీజేపీని ఓడించాలంటే కాంగ్రెస్ సాధ్యం కాదన్నారు. కాంగ్రెస్‌ను భరించాలంటే తమ వల్ల కాదని నితీశ్‌కుమార్ అంటున్నారన్నారు. కూటమికి నితీశ్ కుమార్ కూడా బైబై చెప్పారని, బీజేపీని ఆపాలంటే ప్రాంతీయ పార్టీలతోనే సాధ్యమని స్పష్టం చేశారు. కేసీఆర్ బొండిగ పిసికేస్తా అని రేవంత్ రెడ్డి అంటున్నాడని.. బీఆర్ఎస్‌ను ఖతం చేయాలని బండి సంజయ్ అంటున్నాడని, రాష్టాన్ని అభివృద్ధి చేసినందుకా, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసినందుకా? అంటూ నిలదీశారు. కాంగ్రెస్ నేతలు వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారని, ఉచిత బస్సు పథకం రచ్చరచ్చ అయ్యిందన్నారు. ఆరున్నర లక్షల మంది ఆటో డ్రైవర్లు ఆగమైపోయారన్నారు. బిల్డప్ కోసం పథకాలు తెస్తే పరిస్థితి ఇలాగే ఉంటుందన్నారు. రాష్ట్రంలో 51శాతంపైగా మహిళలు ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీది ఫెవికాల్ బంధమని విమర్శించారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాను పంపితే తిరస్కరించిన గవర్నర్, కాంగ్రెస్ పంపగానే ఆమోదించిందన్నారు. రేవంత్‌రెడ్డి గవర్నర్‌ను కలువగానే రెండు ఎమ్మెల్సీలను ఖరారు చేశారని ఆరోపించారు. కిషన్‌రెడ్డికి మరోసారి ఓటు అడిగే హక్కులేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోతే ప్రజలు బాధపడి సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించారని, కేంద్రమంత్రిగా ఒక్క పని చేయలేదన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి రూపాయి నిధులు కూడా కిషన్ రెడ్డి కేటాయించలేదని విమర్శించారు. కేంద్రమంత్రిగా ఉండి ఎందుకు దండగ అన్నారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. మోదీ పాలనలో ధరల పెరుగుదల తప్ప మరేమీ లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటేనన్న కేటీఆర్. ఇద్దరూ కలిసి రాష్ట్రంలో డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. హామీలను అమలు చేయమంటే కాంగ్రెస్ నేతలకు కోపమొస్తుందని.. ఇందుకు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు సరైన సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్, బీజేపీకి వ్యతిరేకంగా కూటమిని గెలిపించాల్సిన ఉందని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# ఎన్నికల హామీల అమలు దిశగా అడుగులు

- కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం
- లోక్‌సభ నియోజకవర్గం కేంద్రంగా బిసి స్టడీ సర్కిల్
- సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానల ద్వారా నిధులు
- హాస్టళ్లకు సొంతభవనాలు నిర్మించేలా చర్యలు
- బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలపై సమీక్షలో సిఎం రేవంత్



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి27:** ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు నగదుతో పాటు తులం బంగారం ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలపై సమీక్ష నిర్వహించిన సీఎం.. పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలోని ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించేందుకు స్థలాలు గుర్తించి, అంచనాలు తయారు చేయాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు తులం బంగారం ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఈ క్రమంలో అంచనాలు రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రూ. లక్షతో పాటు తులం బంగారం ఇచ్చేలా ప్రణాళికను అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్ నిర్వహణకు అవసరమైన పూర్తి బడ్జెట్‌ను అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. అంచనా వ్యయం ఆధారంగా గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులువిడుదల చేద్దామని తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని సీఎం ఆదేశించారు. అవసరమైన చోట సొంత భవనాలు నిర్మించేందుకు భూమిని గుర్తించాలన్నారు. సొంత భవనాలు నిర్మించేందుకు అంచనా వ్యయాన్ని రూపొందించాలని సూచించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల్లో నగదుతో పాటు తులం బంగారం అందించేందుకు అంచనా బడ్జెట్‌ను రూపొందించాలని అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గం ఒక యూనిట్‌గా బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు అంశంపై పూర్తి అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశానికి మంత్రులు పొన్నం ప్రభాకర్ , సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

## బీహార్ పరిణామాల నేపథ్యంలో అమిత్‌షా తెలంగాణ పర్యటన రద్దు

- ప్రకటన విడుదల చేసిన కిషన్ రెడ్డి



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి27:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన వాయిదా పడింది. ఈ మేరకు కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి ఓ ప్రకటనను విడుదల చేశారు. ఆదివారం అమిత్ షా రావాల్సి ఉండగా బీహార్ పరిణామాల నేపథ్యంలో వాయిదా వేసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికలపై కమలం పార్టీ సీరియస్ ఫోకస్ పెట్టింది. అందులో భాగంగా ఆదివారంబీజేపీ అగ్రనేత అమిత్ షా తెలంగాణలో పర్యటించి ఒకే రోజు మూడు సభల్లో పాల్గొనాలని నిర్ణయించారు. అయితే కొన్ని అత్యవసర పనుల వల్ల అమిత్ షా పర్యటన రద్దు అయ్యింది. దీంతో అమిత్ షా పాల్గొనాల్సిన కరీంనగర్, మహబూబ్‌నగర్, హైదరాబాద్ సమావేశాలు వాయిదా పడిన్లట్లైంది. బీహార్‌లో తాజా రాజకీయ పరిణామాలతో అమిత్ షా టూర్ రద్దు అయినట్లు సమాచారం. త్వరలోనే అమిత్ షా తెలంగాణ పర్యటన ఉంటుందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. షెడ్యూల్ ప్రకారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం రాష్ట్రానికి రావాల్సి ఉంది. కానీ బిహార్ లో జరుగుతున్న రాజకీయ పరిణామాలతో తెలంగాణలో అమిత్ షా పర్యటన రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. కొన్ని అత్యవసర పనుల వల్ల రాష్ట్రంలో అమిత్ షా పర్యటన వాయిదా పడినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కరీంనగర్, మహబూబ్ నగర్,హైదరాబాద్ సమావేశాలు వాయిదా వేసినట్లు ఓ ప్రకటనలో వెల్లడించారు. బిహార్ రాజకీయ పరిస్థితుల కారణంగా అమిత్ షా రేపటి తెలంగాణ పర్యటన రద్దు చేసుకున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం లోని కొంగరకలాన్ గ్రామంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల పార్టీ అధ్యక్షులతో అమిత్ షా సమావేశం ఉంటుందని ఎ÷-లాన్ చేశారు. అయితే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారి అమిత్ షా రాష్ట్రానికి వస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో బీజేపీ మంచి ఫలితాలను సాధించింది. 8 స్థానాల్లో గెలవడమే కాకుండా మరో 18 స్థానాల్లో రెండో స్థానంలో నిలిచింది. దీంతో బీజేపీ బాగా బలపడుతోందని హైకమాండ్ అంచనాకు వచ్చింది. ఈ క్రమంలో పార్టీ నేతకు దిశానిర్దేశర చేయాలని అనుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ నేతలు వర్గ పోరాటానికి దిగడంతో పార్టీ ఎక్కువగా నష్టపోయింది. సీనియర్లు అందరూ ఓడిపోవడానికి వర్గ పోరాటమే కారణమని భావిస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం.. బీజేపీ హైకమాండ్ ఢిల్లీలో ఓ వార్ రూం సిద్ధం చేసింది. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా అదే వార్ రూం పని చేసే ?అవకాశాలు ఉన్నాయి. అక్కడి నుంచి వచ్చే సూచనలు, సలహాలు ఆధారంగా పని చేసే అవకాశాలు ఉన్నాయి. కనీసం పది నియోజకవర్గాల్లో గెలుపు అవకాశాలు ఉన్నాయని ఆ దిశగా ప్రయత్నించాలని ఇప్పటికే దిశానిర్దేశర చేశారు.

## ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమీర్ అలీఖాన్

- అధికారికంగా ప్రకటించిన రాజ్‌భవన్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి27:** గవర్నర్ కోటాలో ఇద్దరు ఎమ్మెల్సీలను తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అమోదించారు. తెలంగాణ జన సమితి వ్యవస్థాపకుడు, ప్రొఫెసర్ కోదండరాం, మీర్ అమీర్ అలీఖాన్‌లను ఎమ్మెల్సీలుగా నియమించారు. వీరిద్దర్ని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ప్రొఫెసర్ కోదండరామ్, సియాసత్ పత్రిక రెసిడెంట్ ఎడిటర్ జావెద్ అలీఖాన్ కుమారుడు మీర్ అమీర్ అలీఖాన్‌లను ఎమ్మెల్సీలుగా ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ఈ రెండు ఎమ్మెల్సీ పోస్టులు ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్నాయి. బీఆర్ఎస్ మొదట వీటి భర్తీ కోసం దాసోజు శ్రవణ్, కె.సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించింది. ఈ÷లును గవర్నర్‌కు పంపించగా ఆమె తిరస్కరించిన విషయం తెలిసిందే.

## ఆప్ ప్రభుత్వం కూల్చివేతకు బీజేపీ కుట్ర

- ఒక్కో ఎమ్మెల్యేకు 25కోట్ల ఆఫర్
- ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు



**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ,జనవరి27:** తన ప్రభుత్వాన్ని కూల్చేందుకు బిజెపి కుట్రలు పన్నిందని ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ నేతలు కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం కూల్చేందుకు ఇటీవలె కొందరు బీజేపీ నాయకులు తమ ఎమ్మెల్యేలను సంప్రదించారని చెప్పారు. 21 మంది ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలతో చర్చలు జరిపారని ఆరోపించారు. తాను ఈ విషయం పై ఏడుగురితో మాట్లాడానని వారంతా తిరస్కరించామని చెప్పారని తెలిపారు. కొన్ని రోజుల తర్వాత కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తామని తమ ఎమ్మెల్యేలతో వారు చెప్పినట్టు తెలిసిందని కేజ్రీవాల్ అన్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలపై విరుచుకు పడతామని బెదిరింపులకు గురిచేశారని తెలిపారు. ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని హెచ్చరించారని ఇందుకు ఒప్పుకుంటే 25 కోట్లు ఇచ్చి ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై పోటీ చేయిస్తామని ఆప్ ఎమ్మెల్యేలతో చెప్పారని కేజ్రీవాల్ అన్నారు. మద్యం కుంభకోణంపైనా దర్యాప్తు చేసేందుకు తనను అరెస్టు చేయడం లేదని కేవలం ప్రభుత్వాన్ని కూల్చేందుకు తనని అరెస్టు చేస్తున్నారని కేజ్రివాల్ అన్నారు. గత తొమ్మిదేళ్లలో ఆప్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఎన్నో కుట్రలు పన్నారని ఆరోపించారు. కానీ అవి ఏ మాత్రం విజయం సాధించలేదని తెలిపారు. దేవుడు, ప్రజలు ఎల్లప్పుడూ తమకు మద్దతు ఇచ్చారని అన్నారు. ఢిల్లీ ప్రజలు ఆప్ ని అమితంగా ప్రేమిస్తారని చెప్పారు. తమ ఎమ్మెల్యేలంతా కలిసి ఉన్నారని ఆప్ చీఫ్ తెలిపారు. ఆప్‌కు చెందిన మొత్తం 21 మంది ఎమ్మెల్యేలతో బీజేపీ పెద్దలు చర్చలు జరిపారని అన్నారు. తమ ప్రభుత్వాన్ని కూలగొట్టే ప్రయత్నంలో భాగంగానే ఇలా చేస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు కేజ్రీవాల్ ఓ ట్వీట్ చేశారు. '21 మంది ఎమ్మెల్యేలతో చర్చలు జరిగాయి. ఇతర ఎమ్మెల్యేలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నాం. ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని కూల్చేస్తాం. మీరు కూడా మాతో రావొచ్చు. రూ.25 కోట్లు ఇస్తాం ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై పోటీ చేయండి' అంటూ తమ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే ప్రయత్నం చేసిందని కేజ్రీవాల్ ఆరోపించారు. అయితే ఆప్ ఎమ్మెల్యేలు అందరూ బీజేపీ ఆఫర్‌ను తిరస్కరించినట్లు వెల్లడించారు.

ఫోకస్ న్యూస్ సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం గ్రామం కర్చల్ లో శ్రీ హాజరుత్ షానురె ఇమామ్ శ్రీ హజరత్ సయ్యద్ యాదుల్ల హుస్సేనీ 101దేవుళ్ళ జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి నిర్వాహకులు బాబు రుకమోద్దీన్ తెలిపారు ఉత్సవాలో భాగంగా శుక్రవారం కర్చల్ నాగనపల్లి ఇందూర్ రాయిపల్లి మోరాటుగా మామిడిపల్లి గ్రామాల వారు చిన్న పెద్ద గంధం నిర్వహించారు శనివారం దీపాల పండుగ ఆదివారం 28 ఖవాలి కార్యక్రమం సోమవారం 29 కుస్తీ పోటీలా కార్యక్రమం 2 మధ్యాహ్నం నిర్వహిస్తున్నటు తెలిపారు కుస్తీ పోటీలలో పాల్గొన్న వారికి మొదటి బహుమతి 5 తులాల 2 వ బహుమతి 4.5తులాల వెండి కడియాలను సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి నిర్వాహకులు బాబు రుకమోద్దీన్ వీరి చేతుల మీదుగా ఇవ్వనున్నట్లు స్థానికులు తెలిపారు జాతర ఉత్సవాలకు వివిధ గ్రామాల ప్రజలు భక్తులు హాజరై విజయవంతం చేయాలనీ కోరారు.




## వేములవాడ, కొండగట్టులో భక్తుల రద్దీ..



**వేములవాడ(నేటి ఫోకస్ న్యూస్)జనవరి 27:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. రాజన్న దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో వేచి చూస్తున్నారు. సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిద్దిపేట, హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి భక్తు భారీగా తరలొచ్చారు.రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొంత మంది భక్తులు కోడెలు కట్టేసి మొక్కు చెల్లించుకున్నారు. అటు జగిత్యాల జిల్లా కొండగట్టులో అంజన్న ఆలయంలో భారీగా భక్తుల రద్దీ కొనసాగింది. ఈసారి మేడారం జాతర జరగనున్న నేపథ్యంలో మేడారం వెళ్లే భక్తులందరూ వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్నను దర్శించుకుంటారు. దీంతో వేములవాడ, కొండగట్టుకు రాష్ట్ర నలుమూలల నుంచి తరలొచ్చారు. అంజన్న ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. దీంతో దర్శనాని రెండు గంటల సమయం పడుతుంది. పోలీసులు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. వాహనాలను బొజ్జ పోతన్న పార్కింగ్ ప్లేస్ లోనే పార్కింగ్ చేసేలా చేస్తున్నారు. భక్తులు వాహనాలు పార్కింగ్ చేసి కాలినడకన గుట్టకు చేరుకుంటున్నారు. అయితే కొండగట్టులో సరైన సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. తాగునీరు అందుబాటులో లేదని చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి అన్ని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. త్వరలో హనుమాన్ దీక్షపరులు కూడా రానున్నారు. వారు వచ్చేసరికైనా అక్కడ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మరోవైపు మేడారం జాతరకు ఏర్పాట్లు కొనసాగుతోన్నాయి. ఫిబ్రవరి నెల 21వ తేదీ నుంచి 24 వ తేదీ వరకు జాతర కొనసాగునుంది...

## అయ్యప్ప స్వామి ఆలయంలో శివ భక్తులకు అన్నప్రసాదం



**వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్) :** రాజనగరం శివారులో గల అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో శివ భక్తులకు అన్న ప్రసాదం ప్రారంభమైందని అయ్యప్ప సేవాసమితి, అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షులు నగేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప స్వామి దేవాలయంలో శ్రీ వీరమరకథ లింగేశ్వర స్వామికి అనునిత్యం నిర్వహించే పూజలకు శివ భక్తులు హాజరుకావాలని కోరారు. అలాగే శివరాత్రి వరకు ఆలయంలో భక్తులకు అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అన్న ప్రసాద వితరణకు లేదా ఆలయ అభివృద్ధికి ఎవరైనా సాయం చేయదలచుకుంటే ఆదాయపు పన్ను మినహాయింపు కోసం 80 ఏ రసీదు సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతినిత్యం పూజలో పాల్గొని అన్న ప్రసాదం చేసే వారికి ఒక్కొక్కరికి ఒకటే టోకెన్ ఉదయం 10 గంటలకు ఇస్తామన్నారు. పూజ అన్న ప్రసాదం స్వీకరించే సమయంలో భక్తులు పంచె కట్టుకుని సెల్ ఫోన్లు దూరంగా ఉంచాలని కోరారు.

## పుట్టినరోజు వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు



**వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్) :** జిల్లా కేంద్రంలోని నాలుగవ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఓబిసి పట్టణ అధ్యక్షులు బొంబాయి మన్యంకొండ సోదరుడి కుమారుడి పుట్టినరోజు వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌన్సిలర్లు పాల్గొని చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ కుమార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ చందర్, కౌన్సిలర్లు బ్రహ్మం చారి, విభూది నారాయణ, చీర్ల సత్యం సాగర్, లక్ష్మి రవి యాదవ్, సుమిత్ర యాదగిరి, జయసుధ మధు గౌడ్, మాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు, యాపర్ల రామ్ రెడ్డి, జయానంద్, తిరుపతయ్య, శివానంద్, చంద్రమౌళి పాల్గొన్నారు.

## చెకుముకి టాలెంట్ టెస్టులో మండల టాపర్స్‌కు ప్రశంసా పత్రాలు



**వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్):** వనపర్తి మండలం రాజపేట ఉన్నత పాఠశాలలో 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన చెకుముకి పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆర్. ప్రణవి, ఎన్. సిరి, కె. బాలు ప్రథమ స్థాయిలో గెలుపొంది మండల టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో వారిని అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది రవికుమార్, సాబేర్,జి. రవీందర్ యాదవ్ (పిఈటి) శిరీష, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో దారెల్లి పెద్ద గురవయ్య మృతి



**(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి మాగి ముఖేష్,బోనకల్లు జనవరి 27:** మండల పరిధిలో ఉన్న చోప్పకట్లపాలెం గ్రామంలో సిపిఎం సీనియర్ నాయకుడు దారెల్లి పెద్ద గురవయ్య (80) గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితి విషమించి చోప్పకట్లపాలెం గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. గత కాలంలో గ్రామ అభివృద్ధికి విశేషమైన కృషిచేసి మంచి సిపిఎం నాయకుడిగా గుర్తింపు పొందారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జరిగే ప్రతి కార్యక్రమంలో అనేక పోరాటాలలో చురుకైన పాత్ర నిర్వహించాడు.దారెల్లి పెద్ద గురవయ్య మృతి పట్ల గ్రామంలో పలువురు ఉద్యమ నాయకులు మరియు వివిధ పార్టీ నాయకులు కుటుంబ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

# జిల్లాలో మాదక ద్రవ్యాల కట్టడికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్



**నేటి ఫోకస్ న్యూస్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి జయశంకర్ జనవరి 27:** జిల్లాలో మాదక ద్రవ్యాల కట్టడికి పకడ్బందీగ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ఉదయ్ కుమార్ ఆదేశించారు. శనివారం ఉదయం ఐ .డి. ఓ.సి. కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అన్ని విద్యాసంస్థల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పోస్ట్ మెట్రిక్ హాస్టల్ లలో కమిటీలు ఏర్పాటు చేసి నివేదిక ఇవ్వటమే కాకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.విద్యార్థులకు, తల్లిదండ్రులకు డ్రగ్స్ విషయంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిఘా పెంచాలని జిల్లా విద్యా శాఖ అధికారి గోవిందా రాజులు ను ఆదేశించారు. తెలంగాణ సాంస్కృతిక కళా బృందం, పోలీస్ కళా బృందం తో కలిసి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో వచ్చే కేసుల్లో మాదక ద్రవ్యాల వాడకం వల్ల వచ్చిన కేసులను రికార్డు చేయాలని అదేవిధంగా జిల్లాలోని అన్ని మెడికల్ షాపుల్లో మత్తు పదార్థాల విక్రయం పై పర్యవేక్షణ ఉండాలని నిషేధిత మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య అధికారి రవి నాయక్ ను ఆదేశించారు. మాదక ద్రవ్యాల విషయంలో అటవీ ప్రాంతాల్లో నిఘా పెట్టాలని, వ్యవసాయ పొలాల్లో గంజాయి సాగు ఏమైనా జరుగుతుందా అనేదానిపై వ్యవసాయ విస్తిర్ణాదికారులు నివేదికలు ఇవ్వాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. మాదక ద్రవ్యాల కట్టడి కోసం ఎక్సైజ్, పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అదనపు కలెక్టర్ ఎల్.బి. కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ సీతారామ రావు, డి.ఎఫ్. ఒ రోహిత్ గోపిడి, డీఈవో గోవిందరాజులు, వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, వైద్య శాఖ నుండి ఇమ్యునైజేశన్ అధికారి రవి నాయక్, డి.ఎస్పీ బి. మోహన్ కుమార్, అచ్చంపేట సి. ఐ కృష్ణ కిషోర్, కల్వకుర్తి నుండి పార్థ సారథి, నాగర్ కర్నూల్ నుండి నర్సింహులు, ఎక్సైజ్ శాఖ నుండి బి. సుధాకర్, డి.పి. ఒ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



**మహబూబాబాద్ (నేటి ఫోకస్ న్యూస్)జనవరి. 27:** ఇంటర్ పరీక్షలను సజావుగా ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశించారు. శనివారం ఐ.డి.ఓ.సి.లోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి అధ్యక్షతన కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరముల పరీక్షలకు 19 థియరీ, 46 ప్రాక్టికల్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 9546మంది జనరల్ కాగా, 8541 ప్రాక్టికల్స్ కు హాజరవుతున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 1వ తేదీ నుండి ప్రాక్టికల్స్ 15 వరకు నిర్వహిస్తామని, ఇంటర్ థియరీ పరీక్షలు ఫిబ్రవరి 28వ తేదీ నుండి మార్చి 14వ తేదీవరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలియజేసారు. అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. ఆర్టీసీ అధికారులు బస్ లను పరీక్షల ముందు ఒక గంట ముందుగా విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకునేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించామన్నారు. విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరాకు, పంచాయతీ, మున్సిపల్ శాఖ అధికారులు శానిటేషన్ చేపట్టాలని, త్రాగునీరు సౌకర్యం కల్పించాలన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్ లను, యాంటీ బయాటిక్ మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పోలీస్ శాఖ బందోబస్తు చేపట్టాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ ఆకస్మికంగా పర్యవేక్షిస్తుందన్నారు. పోలీస్ శాఖ పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రతా సిబ్బందితో ప్రశ్నపత్రాలు పరీక్ష కు అరగంట ముందు కేంద్రాలకు అందించడం, జవాబుపత్రాలు ప్యాకింగ్ పటిష్టంగా చేపట్టి పోస్టల్ శాఖకు అందజేయాలన్నారు. సిసి కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్న పాత్రల ప్యాకింగ్ చేపట్టాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డిఎస్పీ సత్యనారాయణ, తొర్రూర్ ఆర్డిఓ నరసింహ రావు, ఇంటర్ విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, విద్యాశాఖ అధికారి రామారావు, విద్యుత్ శాఖ అధికారి నరేష్, డివిజనల్ పంచాయతీ అధికారి గంగ భవాని,ఆర్టీసీ డి.ఎం.శివప్రసాద్, వైద్యశాఖ అధికారి అంబరీష, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం మేడారం పర్యటన ఖరారు..

- ముఖ్యమంత్రిని కలిసిన సమ్మక్క సారలమ్మ పూజారులు
- మహా జాతర పోస్టరు, ఆహ్వాన ప్రతుల ఆవిష్కరణ
- పూజారుల సమస్యలు, పరిష్కారం చర్యలపై వినతి
- ఫిబ్రవరి 23న జాతరకు వస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి



**వరంగల్ (నేటి ఫోకస్ న్యూస్)జనవరి 27:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం పర్యటన ఖరారైంది. సీఎం హోదాలో ఆయన తొలిసారి సమ్మక్క సారలమ్మ భక్తులు తెలంగాణ కుంభమేళగా పిలుచుకునే మేడారం సందర్శించ నున్నారు. తాను ఫిబ్రవరి 23న మేడారం వస్తానని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇవాళ మేడారం సమ్మక్క సారలమ్మ పూజారుల సంఘం (వడ్డెల సంఘం) ఆధ్వర్యంలో పూజారులు హైదరాబాదులో సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి వెంట ఉన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఫిబ్రవరి 21 నుంచి సమ్మక్క సారలమ్మ జాతర జరగనుంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వసతి సమ్మక్క సారలమ్మ జాతరకు కూడా వర్తించనుందని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో ఈసారి మేడారం జాతరకు భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సమ్మక్క సారలమ్మ పూజారులు మంత్రులతో కలిసి మేడారంలో మహా జాతర నిర్వహణ కోసం ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్లను ముఖ్యమంత్రికి వివరించారు. జరుగుతున్న పనుల పురోగతిని తెలియజేశారు. మేడారంలో సమకూర్చాల్సిన వసతుల ప్రతిపాదనలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ జాతరలో పూజారుల సమస్యలు, పరిష్కారం కోసం చేపట్టాల్సిన చర్యలపై వినతి పత్రం అందజేశారు. మేడారం సందర్శించి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మేడారం సమ్మక్క సారలమ్మ జాతర పోస్టరు, ఆహ్వాన ప్రతులను మంత్రులతో కలిసి ఆవిష్కరించారు. నాలుగు రోజులపాటు వైభవంగా జరిగే సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా ఫిబ్రవరి 23న తాను మేడారం వస్తానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు పూజారులు వెల్లడించారు. పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, ఉన్నతాధికారులు తదితరులు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

## జెట్టి ధర్మరాజుకు ఎంపీ టికెట్ ఇవ్వాలి

- మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్ మాదిగ



**నేటి ఫోకస్ న్యూస్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి జయశంకర్ జనవరి 27:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ లో ప్రజాసంఘాలు మాదిగ హక్కుల దండోరా నాయకుల ఆధ్వర్యంలో సబ్బండ వర్గాలనేత ఎస్సి ఎస్టి బీసి మైనార్టీ పోరం రాష్ట్ర అధ్యక్షులు జెట్టి ధర్మరాజుకు భారత రాష్ట్ర సమితి పార్టీ కానీ కాంగ్రెస్ పార్టీ కానీ ఎంపీ టికెట్ ఇవ్వాలని నినాదాలు చేశారు అనంతరం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా మాదిగ అక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు చింతల శ్యామ్ మాట్లాడుతూ.. ఉద్యమాలకు నెల్సన్ మండేలా ప్రేమకు సేవకు మదర్ తెరిస్సా మరియు మానవ హక్కులకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లాంటి వ్యక్తిని మరిచి పాలకులు గత ప్రభుత్వం గానీ ఇప్పుడు వచ్చిన ప్రభుత్వం గతంలో గాని జెట్టి ధర్మరాజు అన్న సేవలను గుర్తించలేకపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇరు పార్టీల స్పందించి ధర్మరాజుకు ఎంపీ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఇంటికి ఒక్క రుపై వేసుకొని ఇండిపెండెంట్ గా పోటీ చేయిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో నాయకుల కొంగరి శంకర్ కృష్ణ నరేందర్ వెంకట్ స్వామి మహేష్ మహిళలు పాల్గొన్నారు

## పదవ తరగతి ప్రత్యేక తరగతులను ఉపాధ్యాయులు పకడ్బందీగా నిర్వహించాలి......

- సమగ్ర శిక్ష క్వాలిటి కో ఆర్డినేటర్ ఎండి షర్ఫుద్దీన్.......



**ఉమ్మడి అమ్రాబాద్ మండల ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్) జనవరి 27:** వార్షిక పరీక్షలలో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచే విధంగా విద్యార్థులకు విద్యాబోధన చేయాలని జిల్లా అకాడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ ఎండి షర్ఫుద్దీన్ అన్నారు. శనివారం అమ్రాబాద్ మండల ంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి 10 వ తరగతి సంబంధిత పాఠ్యాంశాల పూర్తి, ప్రత్యేక తరగతులు, హాజరు శాతం, అభ్యాస దీపికల తర్ఫీదు, నిర్వహణ అంశాలను పరిశీలించారు. సమ్మేటివ్ అసైన్మెంట్ జవాబు పత్రాలు, వారికి వచ్చిన మార్కులను పరిశీలించి విద్యార్థులు మరింత ఎక్కువగా మార్కులు సాధించేలా, సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయులు అనుసరిస్తున్న బోధనా పద్ధతుల వివరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. 10 వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకోవడానికి గణితంలో ప్రశ్నలు ఇచ్చి పరిష్కరించాలని చెప్పడంతో పాటు కొన్ని ప్రశ్నలను స్వయంగా పరిష్కరించి చేసి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఉదయమే 10 వ తరగతి ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. కేజీబీవీ పదర పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రగతిని పరిశీలించడం, విద్యార్థులు అందరూ 10 జి.పి.ఎ సాధించేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి, ఎండి షర్ఫుద్దీన్, ,జెండర్ కోఆర్డినేటర్ సూర్య చైతన్య, మండల విద్యాధికారి బాలకిషన్,సి ఆర్ పి సరూప, పాఠశాలల ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

## చిన్నబీరవల్లి ప్రాథమిక పాఠశాల యందు సైన్స్ ఫెయిర్, నో బ్యాగ్ డే

- పాల్గొన్న మండల ప్రాజెక్ట్ నోడల్ ఆఫీసర్ దామాల పుల్లయ్య



**(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి మాగి ముఖేష్,బోనకల్లు జనవరి 27:** బోనకల్ మండల పరిధిలో గల చిన్న బిరవల్లి ప్రాథమిక పాఠశాల యందు నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థులు అనేక రకాల సృజనాత్మకత పరికరాలను ఎక్స్పరిమెంట్స్ తయారు చేశారు,ఈ కార్యక్రమంలో సర్పంచ్ పేరబత్తిని శాంతయ్య, ఉప సర్పంచ్ చంద్ర వెంకటేశ్వరరావు ,గ్రామ పెద్ద చంద్ర వెంకట్రావు,మండల నోడల్ ఆఫీసర్ దామాల పుల్లయ్య స్కూల్ హెడ్మాస్టర్ వి నాగమణి ,టీచర్ సునీత, అంగన్వాడీ టీచర్ మరసకట్ల మరియమ్మ, నారాయణపురం స్కూల్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమేష్, జానకిపురం స్కూల్ కాంప్లెక్స్ సెక్రెటరీ అంజయ్య,అంగన్వాడి ఆయా ఎం పద్మ, విద్యార్థులు విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సూర్యతో విడాకులు అంతా తూచ్


పిల్లల చదువు కోసమే ముంబైకి వచ్చా

పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టిన నటి జ్యోతిక

కోలీవుడ్ స్టార్ జంట సూర్య, జ్యోతికలు విడాకులు తీసుకోనున్నట్లు గత కొన్నాళ్లుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. కొన్ని రోజులుగా జ్యోతిక కుటుంబానికి దూరంగా ఉంటూ ముంబైలో ఉంటున్నారు. కుటుంబంలో గొడవలు ఉన్నా పిల్లల చదువుల కోసమే ముంబైకి షిఫ్ట్ అయినట్లు జ్యోతిక క్లారిటీ ఇచ్చారు. అయితే వీరిమధ్య గొడవలు తారాస్థాయికి చేరుకున్నాయని సూర్య, జ్యోతికలు విడాకులు తీసుకుంటున్నారని వార్తలు ఒక్కదాని వెంట మరొకటి వస్తూనే ఉన్నాయి. కుటుంబ కలహాలతోనే వీరు ముంబైలో ఉంటున్నారన్న వార్తలు మాత్రం హల్చల్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా ఈ వార్తలపై జ్యోతిక మొదటిసారిగా స్పందించారు. నాకు సూర్యకు మధ్య ఎలాంటి గొడవలు లేవు. పిల్లల చదువుతో పాటు తను బాలీవుడ్ సినిమాలకు కమిట్ అవ్వడం.. నా తల్లిదండ్రుల ఆరోగ్యం బాగొలేకపోవడం వంటి కారణాలతో తాను ముంబైకు షిఫ్ట్ అయినట్లు చెప్పుకొచ్చారు జ్యోతిక. సూర్య చాలా మంచి వ్యక్తి అని.. మా ఇద్దరికీ విడాకులు తీసుకునే ఆలోచన లేదని చెప్పింది. పిల్లల చదువులు పూర్తవ్వగానే తాము చెన్నై తిరిగి వస్తామని జ్యోతిక వెల్లడించింది.



# గజిబిజి గందరగోళంగా కెప్టెన్ మిల్లర్




తమిళ సినిమా 'కెప్టెన్ మిల్లర్' అదే పేరుతో తెలుగులోకి డబ్బింగ్ చేసి విడుదల చేశారు. ధనుష్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా తమిళంలో సంక్రాంతికి అంటే జనవరి 12న విడుదల చేశారు. అక్కడ ఈ సినిమాకి మిశ్రమ స్పందన వచ్చింది. ఇది ఒక పీరియడ్ డ్రామా, బ్రిటిష్ వారు భారతదేశాన్ని పాలిస్తున్న రోజులనాటి కథ. ఈ సినిమాలో కన్నడ నటుడు శివరాజ్ కుమార్, తెలుగు నటుడు సందీప్ కిషన్ ప్రత్యేక పాత్రల్లో కనపడతారు. ఈ సినిమాకి కథతో పాటు దర్శకత్వం కూడా అరుణ్ మతీశ్వరన్ చేశారు. ధనుష్ కెరీర్ లో ఈ సినిమా బ్జడెట్ ఎక్కువ పెట్టిన తీసినది. ఈ కథ బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశాన్ని పాలిస్తున్న రోజుల్లో, సంస్థానాలు, రాచరికాలు కూడా వున్న ప్రదేశంలో, సుమారు 1930లో జరిగే కథ. అగ్నీశ్వర (ధనుష్) ఒక గ్రామంలో తన తల్లితో ఉంటూ ఉంటాడు, కానీ అతనికి, అతని సహచరులకు ఆ గ్రామంలో కుల వివక్ష కారణంగా గుడిలోకి అడుగుపెట్టనీయరు. కనీసం గౌరవం సంపాదించాలంటే సైన్యంలో చేరితే వస్తుంది అని బ్రిటిష్ సైన్యంలో చేరతాడు. బ్రిటిష్ ప్రభుత్వం అందరికీ పేర్లు మారుస్తూ ఉంటుంది, ఇతనికి మిల్లర్ అని కొత్త పేరు ఇస్తారు. బ్రిటిష్ సైన్యంలో ఉంటూ ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న భారతీయుల్ని చంపుతాడు మిల్లర్, అలా కొంతమందిని చంపాక కోపం వచ్చి తన పై వున్న బ్రిటిష్ అధికారిని చంపేస్తాడు. బ్రిటిష్ ప్రభుత్వం మిల్లర్ ని పట్టుకోబోతే తోటి సైనికుడు రఫీక్ (సందీప్ కిషన్) సాయంతో తప్పించుకుంటాడు. అక్కడి నుంచి అగ్నీశ్వర అలియాస్ మిల్లర్ దొంగగా మారతాడు. ఒకసారి అగ్నీశ్వరని సిపాయిల బారి నుంచి ఆ ఊరి మహారాజు కుటుంబానికి చెందిన అమ్మాయి భానుమతి (ప్రియాంక అరుల్ మోహన్) రక్షిస్తుంది. దొంగగా మారిన మిల్లర్ కి ఊరి గుడిలోని విగ్రహాన్ని దొంగిలించి తెమ్మని చెపుతారు, అతను సరే అంటాడు. ఇంతకూ మిల్లర్ దొంగతనం చేసిన ఆ విగ్రహం ఎవరిది? దానికి ఆ ఊరుకి సంబంధం ఏంటి? శివన్న (శివరాజ్ కుమార్) ఎవరు, అతని పాత్ర ఏంటి? శివన్నకి, మిల్లర్ కి ఎటువంటి సంబంధం వుంది, ఇవన్నీ సినిమా కథగా మలిచారు. కుల వ్యవస్థ, పోరాటాలు సినిమా ప్రారంభం అవటం బాగానే వుంది, కానీ ఆ తరువాతే గాడి తప్పుతుంది. ఫ్లాష్ బ్యాక్ లోకి కథ రావటం, మళ్ళీ ముందుకి వెనక్కి ఇలా ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా పూర్తిగా యాక్షన్ నేపథ్యంలో సాగే సినిమాగా మలిచాడు దర్శకుడు. ఒక దశలో అయితే సినిమా ఎప్పుడు అయిపోతుందా అని ప్రేక్షకుడు అనుకునేట్టు చేసాడు దర్శకుడు. కథ నేపథ్యం ఎప్పుడో 1930 సంవత్సరం కాలం నాటిది కానీ గ్రామంలో మగ్గుతున్న ప్రజలకి ఆధునిక ఆయుధాలు రావటం, అవి ప్రయోగించే విధానం తెలియటం ఆ పోరాట సన్నివేశాలు కథ ఎక్కడ నుంచే ఇంకో దగ్గరికి వెళ్లి అసలు ఏమి జరుగుతోందో కూడా అర్థం కాదు. దర్శకుడు దృష్టి పెట్టి ఉంటే ఈ సినిమా మరింత మంచిగా సాగేది. చివరగా, 'కెప్టెన్ మిల్లర్' సినిమా ఒక మంచి కథతో ప్రారంభం అవుతుంది, బ్రిటిష్ ప్రభుత్వ అండతో అక్కడ వున్న రాచరిక కుటుంబాలు ఒక కులం వారిని ఎలా అణగదొక్కుతున్నారు, ఇంకో పక్క బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకత ఈ నేపథ్యంలో ఉండాల్సిన కథ ఎక్కడికో వెళ్ళిపోయి ప్రేక్షకుడికి నిరాశ పరిచింది.

# ఫిబ్రవరి1 నుంచి విశ్వంభర షూటింగ్


మెగాస్టార్ చిరంజీవికి పద్మవిభూషణ్ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తరువాత చిత్ర పరిశ్రమ అంతా చిరంజీవిని అభినందన వెల్లువలతో ముంచెత్తారు. చిరంజీవి ఈ అవార్డుకు అన్ని విధాలా అర్హుడు అని కొనియాడారు. ఇదిలా ఉండగా చిరంజీవి తన తదుపరి సినిమా 'విశ్వంభర' ఒక ఫాంటసీ నేపథ్యంలో చేస్తున్న సంగతి తెలిసిందే. దీనికి మల్లిడి వశిష్ట దర్శకుడు, ఈ సినిమా షూటింగ్ కూడా ఎప్పుడో మొదలైంది. ఈ సినిమాకి ముందుగానే చాలా ప్రీ ప్రొడక్షన్ పనులు జరిగాయి. ఎందుకంటే ఈ సినిమాకి కంప్యూటర్ గ్రాఫిక్స్ చాలా అవసరం అవుతాయి. కొన్ని రోజుల క్రితం ఈ సినిమా రివీల్ చేస్తూ టీజర్ ఒకటి విడుదల చేశారు, అది వైరల్ అయింది కూడా. అయితే ఇప్పుడు చిరంజీవి షూటింగ్ ఎప్పుడు మొదలు పెడుతున్నారు అనే విషయం మీద ఒక అప్డేట్ వచ్చింది. ఫిబ్రవరి 1 నుండి చిరంజీవి ఈ సినిమా షూటింగ్ మొదలెడుతున్నట్టుగా తెలిసింది. నిన్న చిరంజీవిని అభినందించడానికి వచ్చిన వాళ్ళతో పిచ్చా పాటీ మాట్లాడుతూ తాను ఫిబ్రవరి 1 నుండి 'విశ్వంభర' సినిమా షూటింగ్ లో పాల్గొంటున్నట్టుగా చెప్పారు. సుమారు రెండు వారాలు ఈ సినిమా షూటింగ్ లో చిరంజీవి పాల్గొంటారని తెలిసింది. ఆ తరువాత చిరంజీవి ఒక చిన్న బ్రేక్ తీసుకోవడానికి అమెరికా పయనం అవుతున్నట్టుగా కూడా తెలిసింది. తరువాత మళ్ళీ ఈ సినిమా షూటింగ్ లో నిరవధికంగా పాల్గొంటారని తెలుస్తోంది. ఈ సినిమా యూవీ క్రియేషన్స్ నిర్మిస్తుండగా, ఎంఎం కీరవాణి సంగీతాన్ని సమకూరుస్తున్నారు.



# సంఘీ అంటూ రజనీకాంత్‌పై విమర్శలు

## ఇలాంటి వ్యాఖ్యలు సరికాదన్న కూతురు ఐశ్వర్య

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి ఐశ్వర్య రజినీకాంత్ డైరెక్ట్ చేస్తున్న లాల్‌సలామ్ . విష్ణు విశాల్, విక్రాంత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ఐశ్వర్య రజినీకాంత్ ప్రమోషన్స్ వేగం పెంచింది. రిపబ్లిక్ డే కానుకగా ఈ సినిమా ఆడియో లాంఛ్ ఈవెంట్ చెన్నైలో గ్రాండ్‌గా జరిగింది. అయితే ఈ ఈవెంట్‌లో ఐశ్వర్య మాట్లాడుతూ.. రజినీకాంత్ పై వస్తున్న ట్రోల్స్‌పై తాజాగా స్పందించింది. సోషల్‌మీడియాలో మా నాన్న 'సంఘీ' అంటూ కామెంట్స్ వస్తున్నాయి. నిజానికి సోషల్‌మీడియాకు నేను చాలా దూరంగా ఉంటా.. ఆన్‌లైన్ నెగెటివిటీ గురించి నా టీమ్ తరచూ చెబుతుంటుంది. అలాగే నాన్నగారి పై వస్తున్న నెగటివిటీ గురించి కూడా నా టీమ్ ద్వారా తెలుసుకున్నాను. మేమూ మనుషులమే. మాకూ భావోద్వేగాలు ఉంటాయి. ఈ మధ్యకాలంలో నా తండ్రిని 'సంఘీ' (హిందుత్వ ఐడియాలజీని ఫాలో అయ్యేవారు) అంటూ విమర్శలు చేస్తున్నారు. అయితే 'సంఘీ' అంటే మొదట్లో నాకు కూడా తెలిదు. కానీ తర్వాత దానికి అర్థం తెలుసుకున్నా. ఒక రాజకీయ పార్టీ(బీజేపీ)కి మద్దతు ఇచ్చేవారిని 'సంఘీ' అని పిలుస్తారని తర్వాత తెలుసుకున్నాను. రజినీకాంత్ సంఘీ కాదు. నాన్న అలాంటి వారే అయితే లాల్ సలామ్ చిత్రంలో మొయినుద్దీన్ భాయ్ పాత్రలో నటించే వారే కాదు. దయచేసి ఇలాంటివి ఆపండి అంటూ ఐశ్వర్య చెప్పింది. అయితే కూతురు మాటలు విన్న రజినీకాంత్ అక్కడే కన్నీళ్లు పెట్టుకున్నారు.



# 250 కోట్ల క్లబ్‌లో హనుమాన్

టాలీవుడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం 'హనుమాన్' భారతీయ ఇతిహాసాల్లోని హనుమంతుని కథ స్ఫూర్తితో ఇండియన్ తొలి ఒరిజినల్ సూపర్‌హీరో మూవీగా ఈ చిత్రం రాగా తేజ సజ్జా, అమృత అయ్యర్ ప్రధాన పాత్రల్లో నటించారు. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మొదటిరోజు నుంచే పాజిటివ్ టాక్ రావడంతో బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్ల సునామీ సృష్టిస్తుంది. తాజాగా ఈ చిత్రం 17 రోజుల్లో వరల్డ్ వైడ్‌గా రూ.250 కోట్ల మార్కును అందుకుంది. ఇక రానున్న రెండు రోజులు వీకెండ్ రావడంతో ఈ కలెక్షన్స్ మరింత పెరిగే అవకాశం ఉంది. హనుమాన్ చిత్రాన్ని ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కే నిరంజన్ రెడ్డి తెరకెక్కించగా.. కోలీవుడ్ భామ అమృతా అయ్యర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది. వరలక్ష్మి శరత్ కుమార్, వినయ్ రాయ్, రాజ్ దీపక్ శెట్టి, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీకి గౌరా హరి-అనుదీప్ దేవ్, కృష్ణ సౌరభ్ సంయుక్తంగా మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించారు. జాంబిరెడ్డి తర్వాత తేజ సజ్జా, ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో వస్తున్న తొలి పాన్ ఇండియా సినిమా కావడంతో ఈ సినిమాను జనాలు క్యూ కడుతున్నారు.

